# ఇదీ అలకపాన్పే

-డా. ముక్తేవి భారతి

'ఆ విషయం తల్చుకుంటే చాలు వనజం, నాకు'- ఏదో చెప్పబోయాడు రామారావు.

'అబ్బ, వనజం అని పిలవద్దని ఎన్నోసార్లు చెప్పా- ఎన్నో ఏళ్లుగా చెప్తూనే వున్నా... పిలిస్తే వనజా అని పిలవండి... లేకపోతే, మీ నాన్న మీ అమ్మని పిల్చినట్టు ఒసేయ్ అని పిలవండి' అంది వనజ వంటింట్లో పని చేసుకుంటూ.

"సరే- ఆ విషయం తల్చుకుంటే నాకు ఇప్పటికీ సిగ్గేస్తుంది- ఏమిటో, ఆ రోజుల్లో అదో సరదాట మరి" అన్నాడు రామారావు భార్యకేసి చూస్తూ.

"ఇప్పటికి ఆ విషయం చాలాసార్లు చెప్పారు... పైకి ఎన్ని కబుర్లు చెప్పినా మీకూ ఇష్టమేగా" అంది కూర తరిగిన పళ్ళెం బల్ల మీద పెడుతూ వనజ.

'అది కాదులే అసలు విషయం' రామారావు పకపకా నవ్వాడు.

'అబ్బ, ఆ వీధి గదిలో కూచోండి... నా వెంట వెంట తిరిగితే, పనెలా అవుతుంది' అంది, సిగపిన్నులు సరి చేసుకుంటూ వనజ.

రామారావుకి ఎదురుగా పల్లీల సీసా కనిపించింది. మూత తీసుకుని పల్లీలు నోట్లో వేసుకున్నాడు. రిటైరయిపోయిన రామారావుకి ఏమీ తోచటం లేదు ఈమధ్య. సాయంత్రమయితే కానీ క్లబ్బుకి వెళ్ళలేదు. భార్యని కవ్విస్తూ కాలక్షేపం చేయటంలో గొప్ప సరదా వుంది రామారావుకి.

ఓ పక్కన పెద్దక్కయ్య, మరోవైపు నుంచి మామయ్య తనని ఉక్కిరి బిక్కిరి చేసేసి, అడగరా, అడుగూ అనటం, తనేమో, ఇష్టం లేక అటూ ఇటూ చూస్తూ కూచోటం, అంతలో అలా వెడుతున్న మెరుపుతీగ వనజ, తనకేసి వాలుచూపు చూడడం- ఎన్నెన్ని జ్ఞాపకాలో దొంతర దొంతరలుగా వచ్చి పడుతుంటే, రామారావుకి వంటిల్లు వదిలి, వనజని చూడకుండా ముందు గదిలో కూచోవాలనిపించదు కదా!

"అవును వనజం, ఓ సారీ, వనజా, మీ వాళ్లు మాత్రం ఏమిటి అంత మొండి పట్టుదల పట్టడం- సరే అనొచ్చుగా" అన్నాడు వనజ ఎదురుగా నిలబడి- ఎప్పటి సంగతి అది! రామారావు పెళ్ళి నాటి సంగతి! ఇంచుమించు నలభై సంవత్సరాల నాటి విషయం!

ఆ పెళ్ళిలో అలకపాన్పు ఎక్కాడు రామారావు. తను అలా అలగకపోతే పెద్దక్క, బావ, మామయ్య అంతా తన మీద అలుగుతారు. అమ్మ బాధ పడుతుంది. తన వాళ్ళందరినీ ఆనందపరచటం కోసం సరే అన్నాడు. ఏమడిగాడూ అయినా- స్కూటర్ కొనిమ్మన్నాడు! మేడలా, మిద్దెలా, ఆఫ్ట్రాల్ ఓ స్కూటర్! అంతే!!

"ఊరుకోవమ్మా, అలాగే అడుగుతాడు. అయినా అతనికి కావాలా, వాళ్ళ వాళ్ళ గోల యిది- కట్నంలో కొనుక్కోమందాం, నువ్వేమీ ఖంగారుపడకు" అని ధైర్యం చెప్పాడు వనజ మామయ్య వనజ తల్లికి. మూడు నిద్రలయిపోగానే, భార్యతో కలసి హైదరాబాదు వచ్చేశాడు రామారావు. అయినా అలకపాన్పు విషయం మర్చిపోడు. వీలున్నప్పుడల్లా భార్యని తమాషా పట్టిస్తూనే వుంటాడు. ఈరోజుకీ వనజ ఉడుక్కుంటూనే వుంటుంది.

"చాల్లెండి, అంటే అన్నారంటారు- మా తమ్ముడు ఇంజనీరయి వుండి, ఒక్క పైసా తీసుకోకుండా పెళ్లి చేసుకోలేదూ- అలక పాన్పులూ, బొమ్మలాటలూ మాకు తెలియవు బాబూ- అంతా పల్లెటూరి గోల- మన పెళ్ళికొచ్చిన మా వాళ్ళంతా నవ్వారు తెలుసా"- ఈ మాట కూడా వనజ చాలాసార్లు అంది.

తను పట్నంలో పెరిగిందని, రామారావు పల్లెటూరి వాడని వనజ మనసులో నాటుకుపోయింది.

రామారావు ఆరోజు ఎలాగైనా రెచ్చగొట్టి

భార్యతో తగవుకి దిగాలనే ఉత్సాహంతో వున్నాడు.

"పోన్లే కానీ ఒక్క మాట చెప్పు- నిజంగా నీకెన్నేళ్ళు" అన్నాడు.

"ఏమిటీ- నిజంగా చెప్పటమేమిటీ, నా వయసు ఎంతో మీకు ఇప్పుడు నిజంగా చెప్పాలా- వయసు దాచి అబద్ధాలు చెప్పటం మా వాళ్ళకి రాదులెండి" అంది మూతి తిప్పి.

"ఏమో- నాకు గుర్తొచ్చిందిప్పుడు- మా పిన్ని అంది అప్పుడు- పెళ్ళికూతురికి పద్దెనిమిదేళ్ళేమిటిరా, ఇరవై పైనే వుంటాయి అని-" రామారావు చిలిపిగా వనజ వైపు చూసాడు.

"అవును- ఈపాటి గొప్ప సంబంధం తప్పిపోతుందని అబద్ధాలు చెప్పి, వయసు దాచి... అబ్బబ్బ- పల్లెటూరితత్వం-ఆ అలకపాన్పు-"

"ఊరుకో- అలకపాన్పు విషయం ఎత్తే హక్కు లేదు నీకు- ఆనాటికీ ఈనాటికీ ఇవ్వలేదు నీ బాబు, స్కూటరివ్వని వాడు-" అంతవరకు సీరియస్‌గా వున్న వనజ గలగలా నవ్వేసి, "మీ అబ్బాయికి, అదే వాళ్ళ ముద్దుల మనవడికి కారు కొని పెట్టిందెవరో" అంది- అది వేరే విషయం.

వీధిలో పోస్టుమాన్ కేకతో, బయటకొచ్చిన రామారావు, వచ్చిన ఉత్తరాలు చదవటంలో మునిగిపోయాడు. అందులో ముఖ్యమయిన ఉత్తరం కూతురు విశాల రాసింది.

వారం రోజులయే సరికి రామారావు చిన్న కూతురు విశాల పిల్లాడితో పుట్టింటికొచ్చింది. అల్లుడు అమ్మాయిని దింపి, మళ్ళీ వచ్చి తీసుకెడతానని చెప్పి వెళ్లిపోయాడు.

వనజకి తెలుసు అల్లుడు అమ్మాయిని ఇక్కడ ఎందుకు దించి వెళ్ళాడో. కూతురి అత్తారు బొంబాయిలో వుంటారు. అల్లుడూ అక్కడే ఉద్యోగం. హైదరాబాదులో ఆ కంపెనీ వుండబట్టి ఇక్కడికి రావాలని, అత్తగారు మామగారు కూడా ఉబలాటపడుతున్నారు. తనకీ ఇష్టమే కూతురు అల్లుడు ఊళ్ళో వుంటే- కానీ- వనజ ఆలోచనలు మరోవిధంగా వున్నాయి.

తండ్రీ కూతురు చాలా సేపు మాట్లాడుతున్నారు, వనజ వంటింట్లో వుండగా.

బొంబాయిలో వుండబట్టి తన వియ్యాల వారు చాలా మోడ్రన్ అని, పెళ్ళికి కూడా ఏమీ కోరలేదనీ, కట్నాలు కానుకలు వేధింపులు లేవని, కూతురి అత్తార్ని తల్చుకు మురిసిపోతుంది వనజ. తన అత్తారిలా పల్లెటూరి తత్వం వాళ్ళకి లేదని ఆవిధంగా అమ్మాయి చాలా అదృష్టవంతురాలని గర్వపడిపోతుంటుంది వనజ.

అయినా ఈమధ్య కూతురి అత్తగారి పద్ధతి నచ్చటం లేదు వనజకి. మనవడికి మురుగులు చేయించింది. బంగారు మొలతాడు చేయించింది. అయినా ఇంకా ఏదో తక్కువైన భావమే వియ్యపువారిలో చూడడంతో వనజకి కోపంగానే వుంది.

"అయినా మనం కొంచం గట్టిగా వుండాలి. పెళ్ళయి రెండేళ్ళవుతున్నా ఇంకా ఏదో పెట్టలేదని సాధింపేమిటీ- పెద్దపట్నంలో వున్నా ఈ పల్లెటూరి సాధింపులు పోలేదే" అంది భర్తతో ఓసారి వనజ.

ఈమాటు రామారావుకి చాలా కోపం వచ్చింది. పట్నం, పల్లెటూరు అనే మాటలు వనజ నోటి నుంచి వినీ వినీ వినిగిపోయాడు రామారావు. పైగా పల్లెటూరి వారికుండే ప్రేమలు ఆప్యాయతలు వీళ్ళకేం తెలుసూ? అయినా, తను పట్నందే- పిల్లని ఎంత ప్రేమగా చూస్తోందో తనకి తెలియదా!!

"వనజా, ఈ మాట్లాడే పద్ధతి మార్చుకో. నీ మాటలు అతను విన్నాడంటే, మీ దగ్గరే వుంచుకోండి, పట్నంలో వుంటున్నా పల్లెటూరి వాళ్ళమే అని వదిలిపెడతాడు- అయినా, ఆడపిల్ల- దాని మనసులో మాట ఎవరికి చెప్తుందీ, మనకి కాక" అన్నాడు రామారావు.

వనజకి అర్థమైంది కూతురు ఎందుకొచ్చిందో. అయినా తనకేమీ పట్టనట్టు ఊరుకుంది. మా అమ్మ ఎంత గట్టిదో, పాపం మా నాన్న మంచివాడు అని మరోసారి అనుకుంది విశాల మనసులో

"మీ అమ్మకి ఏం చెప్పనక్కర్లేదమ్మా, అన్నీ అడ్డం కొడుతుంది... అయినా, నీ పెళ్ళప్పుడు మీ అత్తగారికి మామగారికి, మీ ఆయనకి చెప్పానుగా- ఆ ఫ్లాట్ ఖాళీ చేయించి నీకిస్తానని- అంతే" అన్నాడు చాలా తేలిగ్గా రామారావు. ఇది



రహస్యం– తండ్రీ కూతుళ్ళ మధ్య రహస్యం!!

విశాలకి ఎంతో సంతోషమేసింది. అత్తగారికి చెప్పాలి వెళ్ళగానే, ఈ విషయం అనుకుంది. ఆ ఫ్లాట్ విషయం మీ నాన్నతో తేల్చుకునే రా అంది అత్తగారు. అంటే, ఆ విషయం తేలకపోతే, అక్కడికి రావద్దనేగా– విశాలకి ఒక్కసారి భయమేసింది ఆరోజు. విశాల భర్త కూడా మా అమ్మ చెప్పిన మాటలో తప్పేముంది. పెళ్ళికి ముందు మీ నాన్న చెప్పిందే ఇది... రెండేళ్ళయింది ఆ విషయం మాట్లాడుతున్నారా చూడు– పైగా మీ అమ్మ అందరితో అంటోందిట మా అల్లుడు ఎంతో మంచివాడు, మా దగ్గర నుంచి ఏమీ ఆశించడు అని– కానీ విశాలా, నేనేమీ ఆశించటం లేదు కానీ, మీ నాన్న అన్న మాట నిలబెట్టుకోవాలిగా అన్నాడు భార్య చీర కొంగుతో ఎమాతి తుడుచుకుంటూ.

అప్పటి నుంచి విశాలకి భయం పట్టుకుంది. తల్లితో ఒకసారి అంది. వనజ అంతెత్తున లేచి, "అంటే, ఆ అద్దెకున్న వాళ్ళని ఖాళీ చేయించి, మీ ఆయన ఇక్కడ ఉద్యోగంలో చేరేప్పటికి మీరంతా వుండటానికి సిద్ధం చేసి పెట్టాలంటావా- బావుందే, ఆ ఫ్లాట్ మీద వచ్చే అద్దె మేము వాడుకుంటున్నాంగా... అయినా, ఫ్లాట్ ఇస్తామని మీ నాన్న అన్నారేమో, అయితే, ఇప్పుడే ఇస్తామా- ఎప్పుడో ఇంకో పదేళ్ళ తర్వాత ఆలోచించాల్సిన విషయం అది'' అంది చిరాగ్గా. విశాల చిన్నబుచ్చుకుంది.

అది జరిగి ఆర్నెల్లయింది... హమ్మయ్య, పిల్ల తెలివైంది- అల్లుడికి నచ్చచెప్పి వుంటుందని మురిసిపోయింది వనజ.

ఇన్నాళ్ళకి అల్లుడు కూతుర్ని తీసుకొచ్చి దింపాడు. రెండు రోజులయిందో లేదో అల్లుడొచ్చాడు, ఆ రాత్రి వెళ్ళిపోయింది కూతురు. మనవడు ఇంట్లో లేకపోయేసరికి చిన్నబోయినట్లనిపించింది రామారావుకు.

భార్య భర్త భోంచేస్తున్నారు.

"ఏమండీ, ఏమంటాడు అల్లుడు" అంది రామారావుతో భోంచేస్తూ.

"మా అత్తగారెలా చెప్తే అలా అన్నాడు. అతను బుద్ధిమంతుడు" అన్నాడు రామారావు. అంతలో ఫోను గణగణ మోగింది. రామారావు గొంతు తగ్గించి, ఊఁ, ఆ అంటున్నాడు.

'ఎవరూ' అంది వనజ. 'నా ఫ్రెండు, ఢిల్లీ నుంచిలే' అన్నాడు రామారావు. ఫోను పెట్టేశాక రామారావు కళ్ళలో కూతురే మెదిలింది. ఆ పిల్ల గొంతులో గాద్గద్యం రామారావు చెవుల్లో వినిపిస్తోంది. పిల్లల మనసులు బాధపడితే, తల్లితండ్రులకి ఆనందమేమిటీ- రామారావు ఆ రాత్రంతా నిద్రపోలేదు. అమ్మాయి ముఖంలో ఆనందం చూడాలి. అమ్మాయి అల్లుడు హాయిగా వుండాలంతే!!

తెల్లవారగానే ''అర్జంటు పనుంది, సాయంత్రం దాకా రాను", అని బయటికి కారు తీసుకు వెళ్ళిపోయాడు రామారావు.

వారం రోజులయ్యాక రామారావు విజయవాడ వెళుతున్నానన్నాడు భార్యతో. 'దేనికీ' అంది. "అదే నా ఫ్రెండు గృహప్రవేశం వుంది, రమ్మని మూడుసార్లు ఫోను చేశాడు. పైగా వచ్చి వారం రోజులుండాలంటున్నాడు'' అన్నాడు రామారావు పేపర్లో ముఖం దాచుకుని.

"నేనూ వస్తా మీతో" అంది వనజ.

ఉలిక్కిపడ్డాడు రామారావు...

"మిమ్మల్నే- విజయవాడ నేనూ వస్తా- కనకదుర్గ మొక్కు చెల్లించుకోవాలి- అమ్మవారికి చీర కట్టిస్తానని మొక్కుకున్నా- పైగా, వారం రోజులుండాలంటున్నారు... ఈ రాత్రికే వెడదామా" అంది ఉత్సాహంగా వనజ.

రామారావుకి ముఖం వెలతెలపోయింది.

"ఆ మొక్కులు అవీ తర్వాత తీర్చుకో- పైగా, నేను సరదాగా వెడుతున్నా ననుకుంటున్నావా... ఒక్క నిమిషం తీరిక వుండదు నాకు" అన్నాడు.

"ఏమిటో రాచకార్యాలు" అంది వనజ.

"నీకర్థం కావులే- అయినా, ఇంకోసారి వెడదాం నువ్వు నేను- నేనైతే ఫ్లయిట్‌లో వెళ్ళిపోతా"- రక్కున నాలుక కరుచుకున్నాడు.

"ఏమిటీ- ఫ్లయిటా- రాత్రి బస్సెక్కితే తెల్లారేసరికి దిగుతారు- ఏమో, నేనైతే ఖచ్చితంగా వస్తున్నా" అంది వనజ. రామారావు మాట్లాడలేదు.

రెండు రోజులు గడిచాయి. రామారావు ప్రయాణం విషయం మాట్లాడటం లేదు. వనజ సూట్‌కేసు సర్దుకుంది. "నేనసలు వెళ్ళటం లేదు- అయినా గృహప్రవేశం పెద్ద విశేషమా రానని ఫోన్ చేసి చెప్పేశా" అన్నాడు.

వనజ ఏమీ అనలేదు కానీ, నిజమే, ఇద్దరం ఎందుకూ, డబ్బులు దండగ అనిపించింది.

"పుష్కరాలకు ఎలాగూ వెడతాగా, మీరు వెళ్ళండి" అంది. రామారావుకి ఆ మాట నెత్తిన పన్నీరు పోసినట్టయింది.

ఆ రాత్రి ఇంట్లోంచి బయులుదేరిన రామారావు తిన్నగా ఎయిర్‌పోర్టులో ఆగాడు.

బొంబాయిలో అమ్మాయి అల్లుడు ఎయిర్‌పోర్ట్‌కొచ్చి రామారావుని వెంటబెట్టుకెళ్ళారు. మనవడితో ఆడుకుంటుంటే రామారావుకి కాలం తెలియలేదు.

వనజ ఆరోజు పొద్దుటి నుంచి ఎదురు చూస్తోంది రామారావు రాలేదేమా అని. అయినా ఎక్కడికెడితే, అక్కడే వుండిపోతారు, ఇల్లు, పెళ్ళాము గుర్తురాదు అంటూ నసుక్కుంటుంటే రామారావు ఇంట్లో అడుగుపెట్టాడు.

'అబ్బ, ఎంత బడలికగా వుందో వనజం, ఈ బస్సు ప్రయాణం, ఇక నుంచి ఈ బస్సులు రైళ్ళు కాదు. వెడితే విమానంలో లేకపోతే లేదు' అన్నాడు కావాలని.

'కాఫీ తాగండి' అంది కప్పు బల్లమీద పెట్టి.

"స్నేహితుడి కొత్త యిల్లు, రోజుకో రకంగా వర్ణించి చెప్తూ నువ్వు రావలసింది" అన్నాడు.

ఎనిమిది నెలలు గడిచాయి... అమ్మాయి, అల్లుడు ఫోన్ చేసినపుడల్లా రామారావు మాట్లాడి పెట్టేస్తున్నాడు.

'ఏమంటుందీ' అంది వనజ, పూలు కట్టుకుంటూ.

'ఏముందీ ఊరగాయలు చేసి పెట్టమంది, వచ్చి తీసుకెడుతుందిట' అన్నాడు.

ఆరోజు దూరవు చుట్టాల పెళ్ళిలో వియ్యపురాలు కలిసింది. ఆమాట ఈమాట చెప్పుకున్నాక, ఇంటికొచ్చి వెళ్ళండి అంది వనజ.

'రాకుండా ఎలా-- మా అన్నయ్యగారితో ఆమాట చెప్పాలి కూడా' అంది వియ్యపురాలు.

'అదే, ఆ ఫ్లాటు అద్దె ఐదు నెలలు బాగానే పంపించాడు... రెండు నెలలయింది అద్దె పంపలేదు... వాడితో ఓ మాట, నేనూ అన్నయ్యగారూ వెళ్ళి మాట్లాడాలి' అంది.

వనజ ముఖం జేవురించింది. అంటే, తనకి తెలియనీయకుండా ఆ ఫ్లాట్ అద్దె వాళ్ళకి పంపించే ఏర్పాటు చేశారన్న మాట. వామ్మో, ఎంత కుట్ర, ఎంత మోసం!! అందుకే కామోసు, అంకుల్ ఈజ్ వెరీ నైస్ అని అల్లుడు, డాడీ చాలా మంచివారని అది తెగ పొగిడేస్తున్నారు. వనజ మనసు కుతకుతలాడిపోయింది. 'అన్నయ్యగారు వచ్చినపుడు చెప్దామనుకున్నా, మరిచిపోయాను' అంది వియ్యపురాలు మెడలో చంద్రహారం సవరించుకుంటూ.

ఓహో! మొన్న వెళ్ళింది విజయవాడకి కాదన్న మాట!!

వనజ గబగబా ఇంటికొచ్చేసింది. టి.వి. చూస్తూ పరమానందపడిపోతున్నాడు రామారావు. టి.వి. కట్టేసింది. "నాకు చెప్పకుండా బొంబాయి వెళ్ళి వచ్చారా... ఆ అల్లుడికి భయపడి, ఫ్లాట్ మీది అద్దె అతనికి అందేట్టు ఏర్పాటు చేశారా-- - ఏమిటండీ, ఏమిటిదీ!! వనజ భద్రకాళి రూపం చూశాక అర్థమయింది రామారావుకి రహస్యం బయటపడిపోయిందని!!

రామారావు ఒక్క మాట మాట్లాడకుండా ఊరుకున్నాడు. ఇంట్లో ఇద్దరి మధ్య నిశ్శబ్దం తాండవించింది. వనజ గదిలో మోగుతున్న ఫోను ఎత్తింది. 'మమ్మీ, నాన్నని పిలు' అంది విశాల. 'ఏం, నాతో మాట్లాడవా... ఆ ఫ్లాటు అమ్మమంటున్నాడా మీ ఆయన' అంది. విశాల ఫోను పెట్టేసింది.

'ఇదీ మరో రకం అలకపాన్పే-- ఫ్లాట్ ఇవ్వకపోతే ఏం చేస్తాడుట' అంది కోపంగా భర్తతో.

"అలకపాన్పు స్కూటర్ మీ నాన్న ఎగ్గొట్టాడని, నేను నా అల్లుడికి అలా చేయను, నేను ఫ్లాట్ కాదు, ఈ ఇల్లు ఇమ్మన్నా ఇచ్చేస్తా, మాట్లాడకు"- రామారావు కారు స్టార్ట్ చేసుకుని క్లబ్బుకెళ్ళిపోయాడు.

వనజ బుగ్గ మీద చెయ్యేసుకుని, తులసికోట ముందు గట్టు మీద కూచుంది. "నాగరికతకి ఇదో ముసుగూ-- కాకపోతే ఇది మాత్రం అలకపాన్పు కాదూ" అనుకొని కూతురు అల్లుడు ఎంత తెలివిగా తండ్రిని మెప్పించి తమ పని సాధించుకున్నారో అనుకుంటూ, ఆ తెలివి తనకి లేకపోయింది కదా అని చాలా చాలా బాధపడిపోయింది వనజ, సంధ్యా సమయంలో. ■

---

## ముగ్గురే

ఆరంభంలో
శ్రోతలతో కిటకిటలాడిన కవి సమ్మేళనం
చివరి దశలో
మిగిలింది ముగ్గురే-
సభాధ్యక్షుడు, ముఖ్య అతిథి, చివరి కవి.

*-మహమ్మద్ తహసీన్ అలి*